మన
# చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 109 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 18 మార్చి 2026 | పేజీలు : 4




## సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది



- సీఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా
- ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి
- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా
- గత గవర్నర్ ప్రసంగాలకు.. నేటికి ఏం తేడా..!
- ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా..నిధులు ఇచ్చి వస్తున్నారు
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ విసుర్లు

3 లో




## ఉద్యోగాలు ఇప్పిస్తామని
# ఘరాన మోసం

- రూ.65 లక్షల వరకు వసూళ్లు
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పండరి చేతన్ నితిన్

**జనగామ, మన చౌరాస్తా :** ఉద్యోగాలు, పెట్రోల్ బంక్లు ఇప్పిస్తామని మోసం చేస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఏసీపీ పండరి పండరి చేతన్ నితిన్ మంగళవారం వివరాలు వెల్లడించారు.. జనగామ పట్టణానికి చెందిన బెలిగిని శివకుమార్ పురోహితం చేస్తూ జీవనం సాగుతున్నాడు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం ధమ్మక్కపేటకు చెందిన ఇల్లందుల శ్రీనివాస్, ఇదే జిల్లా చెందిన చిగురుమామిడి మండలానికి చెందిన ఆకవరం సాయి చరణ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలాని చెందిన దరావత్ రాజేష్ తండ్రి విరంతా స్నేహితులు. శివ కుమార్ జనగామ పట్టణంలో పురోహితుడిగా పనిచేస్తూ తన వృత్తి కారణంగా పంచాంగం, పెళ్లి ముహూర్తాలు తదితర విషయాల కోసం తన వద్దకు వచ్చే అమాయక ప్రజలతో పరిచయం పెంచుకుని, వారికి నమ్మకం కలిగించే విధంగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో అతను తనకు ఉన్నత స్థాయి రాజకీయ నాయకులు, పోలీస్ శాఖ అధికారులతో సన్నిహిత పరిచయాలు ఉన్నాయని అబద్ధంగా చెప్పి ప్రజలను నమ్మబలికాడు. ముఖ్యంగా మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్, పోలీస్ శాఖలో సీపీ సజ్జనార్ తనకు తెలిసినవారని చెప్పి విశ్వాసం కలిగించేవాడు. ఇంకా తాను జనగామలో పెట్రోల్ బంక్ ప్రారంభించబోతున్నానని, అలాగే ఉద్యోగాలు కూడా ఇప్పించగలనని చెప్పి ప్రజలను ఆకర్షించాడు. ఎవరికైనా ఉద్యోగం కావాలన్నా, వ్యాపార అవకాశాలు కావాలన్నా తనను సంప్రదించమని చెప్పి వారి నుండి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసేవాడు. ఈ విధంగా మోసపూరితంగా సేకరించిన డబ్బులను తన అల్లుడు సాయి చరణ్, ఇల్లందుల శ్రీనివాస్, దరావత్ రాజేష్లకు పంపించేవాడు. అనంతరం ఈ నలుగురు కలిసి ఆ డబ్బులను తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుని, విలాసవంతమైన జీవితం గడిపారు. ఈ విషయంపై జనగామ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు కాగా వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచనల మేరకు, ఏసీపీ పండరి చేతన్ నితిన్పర్యవేక్షణలో జనగామ సీఐ పి.సత్యనారాయణ రెడ్డి, సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.భరత్ కేసు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో మంగళవారం హన్మకొండ రోడ్ లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక వద్ద నలుగురు నిందితులు ఉన్నారని సమాచారం రాగా, వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని నలుగురు నిందితులు అదుపులోకి తీసుకొని విచారించగా వారు చేసిన నేరం ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై ఎం.భరత్, సిబ్బందిని వరంగల్ సీపీ అభినందించారు.



# విధులను విస్మరించవద్దు

- అధికారులు పారదర్శకంగా పని చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** రెవెన్యూకు సంబంధించిన ఏ అంశాలు పెండింగ్‌లో పెట్టకూడదని, నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పనులు పూర్తి అయితేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం భూ భారతి, ఇసుక తరలింపు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సెన్సస్ తదితర అంశాలపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతికి సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ల వారీగా లక్ష్యాలను కలెక్టర్ నిర్దేశించారు. ఇసుక తరలింపు గురించి మాట్లాడుతూ అక్రమ ఇసుక, మొరం, గ్రావెల్ అక్రమ రవాణా కాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను, అలాగే జనాభా లెక్కల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, వయస్సు, విద్యార్హత, వృత్తి, సామాజిక వర్గం, మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, మొత్తం అన్నీ అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాలని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్లు తమ అధికారాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు ఉండొద్దు



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, ఇతర సంబంధిత అధికారులతో కలిసి గ్యాస్ సరఫరా, నిల్వలపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాస్థాయి గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఈఎస్ఎంసీ) సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ అమలు, ప్రస్తుత గ్యాస్ సరఫరా, నిల్వల పరిస్థితిపై క్షుణ్ణంగా ఆయా శాఖల సంబంధిత అధికారుల ద్వారా ఆరా తీశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 12 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో డిమాండ్ కు అనుగుణంగా సంబంధిత ఏజెన్సీల వద్ద వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు నిల్వలో ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు రవీందర్, హసీనా బేగం, విక్రమ్, డీడబ్ల్యూఓ కోదండరాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, గ్యాస్ డీలర్ల సంఘం ప్రెసిడెంట్, సభ్యులు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.



## ఘనంగా స్వయం పాలన దినోత్సవం

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** జనగామ మండలం మరిగడి ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే బాధ్యతలు చేపట్టి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, డీఈఓ, ఎంఈఓలుగా వ్యవహరించారు. అక్షర హెచ్‌ఎంగా, కావ్య, హిమబిందు, నితీష్, జాహ్నవి, రామీలు ఉపాధ్యాయులుగా, రాహుల్ పీఈటీగా, అనిరుదిన్ డీఈఓగా, రితీష్, రిషి, విష్ణు ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పి.నర్సమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులు సాంబరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు అన్నదానం అందిస్తూ సేవా భావాన్ని చాటిన ఆర్యవైశ్య అన్నప్రసాద వితరణ కేంద్రం నిర్వహించిన కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకట్ రెడ్డి పాల్గొని ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లు, వారి బంధువులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డిని ఆర్యవైశ్య సంఘ నాయకులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు అన్నదానం చేయడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులను ఆయన అభినందించారు. వారి సేవా భావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.





## సీనియర్ జర్నలిస్ట్ ఆంజనేయులుకు టీఎస్ జేయూ నేతల పరామర్శ

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ చిటుకుల ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఈద శ్రీనాథ్ ఆయనను పరామర్శించారు. మంగళవారం ఆంజనేయులు స్వగ్రామమైన వడ్డిచర్లకు చేరుకున్న వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. వారి వెంట టీఎస్‌జేయూ జనగామ జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్, ప్రధాన కార్యదర్శి గన్ను కార్తీక్, కోశాధికారి కొన్నె ఉపేందర్, కార్యనిర్వహణ కార్యదర్శి కౌశిక్, సహాయ కార్యదర్శి గండి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు ఆఫ్రోజ్ తదితరులు ఉన్నారు.



## పంతులుపల్లి స్కూల్‌లో స్వయం పాలన

**నల్లబెల్లి, మన చౌరాస్తా :** నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామపరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి, సహోపాధ్యాయులు కూనమల్ల రాజన్ బాబు మార్గదర్శకత్వంలో జరిగిన ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు రాధారపు శివాని హెడ్మాస్టర్ గా, ఎర్ర లాస్య సర్పంచ్ గా, ఏఏపిసి చైర్మన్ గా బైరి ప్రసన్న, ఉపాధ్యాయులుగా నేతునూరి వర్షిత, రాధారపు రుత్విక్ తేజ వ్యవహరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎరుకల లలిత, ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి పాఠశాలను సందర్శించి, స్వయం పరిపాలనా దినోత్సవంలో చురుకుగా పాల్గొన్న చిన్నారులను అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయ ప్రోగ్రామ్‌లో రైతులకు కిట్ల పంపిణీ



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సాయి నగర్ రైతువేదిక వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 125 మంది రైతులకు కిట్లను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాయినగర్, కొత్తపల్లి సర్పంచ్ లు మేకల వెంకన్న, సికె ప్రదీప్ రైతులకు కిట్లు అందజేశారు. ఈ కిట్లలో క్యాప్, పెన్, బుక్, ఐడీ కార్డు, క్లాత్ బ్యాగ్, క్యాలెండర్ వంటి వస్తువులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఈవో క్రిసొలైట్, కృషి సఖీ మంద సుజాత, కొట్టె రేణుకతో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

- సీఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా
- ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి
- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా
- గత గవర్నర్ ప్రసంగాలకు.. నేటికి ఏం తేడా..!
- ఐటి సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి
- ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా..నిధులు ఇచ్చి వస్తున్నారు
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ విసుర్లు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ శాసన సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆరఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది? తొలి క్యాబినెట్ లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్ కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు.కాంగ్రెస్ నేతలు దిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆరఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్ లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకుంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు.



పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్దాలు వల్లెవేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆరఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పుమాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఉద్యోగుల సంక్షేమం, పీఆర్సీ అమలు ఏదీ

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పీఆర్సీ అమలు , పెండింగ్ డీఏల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆయన ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీఆర్సీ వేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేటికీ ఆ దిశగా అడుగులు వేయకపోవడం ఉద్యోగ వర్గాలను వంచించడమేనని ఆయన విమర్శించారు. పీఆర్సీ గడువు ముగిసి 27 నెలలు కావస్తున్నా ఇంకా పత్తా లేదని, అలాగే 5 డీఏలు బాకీ ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. కేవలం సర్వీసులో ఉన్న ఉద్యోగులే కాకుండా, రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి రాష్ట్రంలో అత్యంత దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన తర్వాత రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందక, ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు సుమారు 80 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి పలు ఉదాహరణలను ప్రస్తావిస్తూ.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి కూడా డబ్బులు లేక, తమకు రావాల్సిన సొంత సొమ్ము కోసం ఎదురుచూస్తూ ప్రాణాలు వదిలిన ఘటనలు కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. 60 లక్షల రూపాయల వరకు బెనిఫిట్స్ రావాల్సిన ఇన్స్పెక్టర్లు, హెడ్ మాస్టర్లు అప్పుల ఒత్తిడితో గుండెపోటుకు గురై మరణించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన విమర్శించారు.



# రైతు సమస్యలపై వినతి పత్రం

**అక్కన్నపేట, మన చౌరాస్తా :** అక్కన్నపేట మండల కేంద్రంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు సూచనలతో రైతు సమస్యలపై ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమం మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రైతుబంధు అందజేయాలని, గత యాసంగి కాలంలో సన్నాలకు ప్రకటించిన రూ.500 బోనస్ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట బీమా (పసల్ భీమా) అమలు చేసి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, మహిళలకు రూ.2500, నిరుద్యోగులకు భృతి, చదువుకునే అమ్మాయిలకు ల్యాప్టాప్లు, స్కూటీలు వంటి హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత సీజన్లో పంట నష్టపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం ఇవ్వాలని, యూరియా సరఫరాలో యాప్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పట్టా పాస్బుక్ ఆధారంగా ఎరువులు అందించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు లూజ్ వైర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, అక్కన్నపేటలో మొక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్, అసెంబ్లీ కోకన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, మడక రవికుమార్, తోట సరూప, ఇరుగు దిండ్ల రాజకుమార్, మోహన్ నాయక్, వేముల ప్రసాద్, సాంక సంతోష్, కళ్యాణ్, విష్ణు, సంజీవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వంగల శ్రీనివాస్ రెడ్డి, బొంకురి రజినీకాంత్, నేరెళ్ల రమేష్, కనకయ్య, మిట్టపల్లి సత్యనారాయణ, గుంపల మధు, బొడిగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# పురుగుమందుల వాడకంపై అవగాహన

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి గ్రామంలో రైతులకు పురుగుమందుల సురక్షిత వినియోగంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ - నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బి.సి.ఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు పంటలను పరిశీలించి ఆర్థిక నష్టం స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగుమందులు పిచికారి చేయాలని సూచించారు. పురుగుమందులు పిచికారి చేసే సమయంలో తప్పనిసరిగా రక్షణ దుస్తులు (పీపీఈ) ధరించాలని, ముఖానికి మాస్క్, తలకు హెల్మెట్, కళ్లకు అద్దాలు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు వేసుకోవాలని వివరించారు. ఎరుపు గుర్తు కలిగిన మోనో వంటి ప్రమాదకర మందులను వాడరాదని, పర్యావరణానికి హాని కలిగించే రసాయనాల వినియోగాన్ని తగ్గించి కషాయాలను ఉపయోగించాలని సూచించారు. ఒకేసారి రెండు మూడు రకాల పురుగుమందులు కలిపి పిచికారి చేయకూడదని, మార్కెట్లో నమోదు చేసిన పురుగుమందులు మరియు కాంబినేషన్ రూపంలోని పెస్టిసైడ్స్ మాత్రమే వాడాలని తెలిపారు. అలాగే రైతులు కూలీలకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించారు. ఈ సూచనలను పాటించడం ద్వారా రైతులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణాన్ని సంరక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి.ఐ సమన్వయకర్తలు సాయికిరణ్, తిరుపతి, రజిత సోనీ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.




## ఆసక్తికర టీజర్

నువ్వు ఒక్క చిటికేస్తే నీ వయసు అబ్బాయిలు చాలా మంది ఇలా వచ్చి పడిపోతారని సూర్య చెప్పడం.. కావాలంటే ఇంకో నాలుగు చిటికెలేస్తా. నువ్వు పడు చాలు' అంటూ మమిత క్యూట్‌గా బదులివ్వడం విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు ఇదే ట్రెండ్ అవుతోంది. మనం గొప్ప అనుకున్న ప్రతిసారీ మనకన్నా గొప్పోడు ఒకడుంటాడని దేవుడు గుర్తు చేస్తాడు అంటున్నారు కథానాయకుడు సూర్య. ఇప్పుడాయన నుంచి రానున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మమితా బైజు కథానాయిక. ఈ చిత్రం జులైలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. 'సంజయ్ విశ్వనాథ్ గతంలో ఎన్నో పిస్టల్ కాంపిటేషన్స్‌లో గెలిచారు. కానీ, ఇప్పుడు వేరు. కంటి చూపుకి 20ల్లో ఉన్న ఫిట్‌నెస్ 40 దాటాక ఉండదు' అనే డైలాగ్‌తో సూర్య పాత్రను పరిచయం చేస్తూ టీజర్ సాగిన తీరు ఆద్యంతం అలరించింది. దీంట్లో మ్యాడీగా మమితా బైజు చేసిన సందడి ఆకట్టుకుంది. ఆమె వయసులో తనకంటే 20ఏళ్లు పెద్దవాడైన హీరోపై మనసు పారేసుకోవడం.. ఈ ఇద్దరి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ఈ ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**